క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

15న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 15న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

మహిళా కళాశాలలో యోగా కార్యక్రమం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో యోగా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి విద్యార్థులకు యోగా విశిష్టత గురించి వివరించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ ఎ. హైమావతి, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ కె. ప్రశాంతి, ట్రైనర్ బి. సునీల్, విద్యార్థినులు పాల్గొన్నారు.

రహదారులు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

కంచరపాలెం: రహదారులు ఆక్రమిస్తూ వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారి, కంచరపాలెం రైతుబజారు, ఊర్వశికూడలి, ఐటీఐ కూడలి, 104 ఏరియా ప్రాంతాల్లో మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ మేరకు కంచరపాలెం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మళ్ల అప్పారావు, జోన్–5 టౌన్‌ప్లానింగ్ నేతృత్వంలో ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. వ్యాపారస్తులు రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఐటీఐ కూడలిలో ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌లపై దుకాణాలను తొలగించారు. రైతుబజార్ ప్రాంతంలో తోపుడుబళ్లతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారుతుందని సీఐ మళ్ల అప్పారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

మురుగుతో అవస్థలు



నిరసన తెలుపుతున్న స్థానికులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం 80ఫీట్ రోడ్ వాటర్ ట్యాంక్ పక్కన మురుగు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై స్థానికులు వీరాటవర్స్ ఎదురుగా మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. తారకరామానగర్, ప్రశాంతినగర్, గురునాథరావు కాలనీ, రామచంద్రనగర్ ప్రాంతాల వాసులు నిత్యం ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటి రహదారిపై ఇలా మురగునీరు ప్రవహిస్తూ, దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునే నాథుడు లేడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ కమిషనర్‌ను ఆన్‌లైన్లో ఫిర్యాదు కూడా ఇచ్చామని, అయినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయమై అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రాణదాతలకు.. ప్రణామం



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్



అప్పారావును సత్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ (ఫైల్)

వివేకానందుని భావనలు పుణికి పుచ్చుకుని ఆయన బాటలో నడుస్తూ వారు అన్నార్తులను అక్కున చేర్చుకున్నారు. మృత్యువుతో పోరాడుతున్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలయ్యారు. వారే వన్‌టౌన్‌లో ఉన్న స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు. వారిలో సూరాడ అప్పారావు ఇప్పటి వరకు 115 సార్లు రక్తదానం చేశారు. మరో సభ్యుడు పోలవరపు అప్పలకొండ 30 సార్లకు పైగా రక్తదానం చేసి ఎంతో మంది ప్రాణాలు నిలబెట్టారు.

- రక్తదానంతో ఆయుష్షు పోస్తున్న దాతలు
- అపోహలతో ముందుకు రాని వారెందరో..
- నేడు రక్తదాతల దినోత్సవం

దాబాగార్డెన్స్ : ప్రాణాపాయ సమయాల్లో రక్తం చాలా అవసరం అవుతుంది. అయితే రోగికి కావలసిన రక్తం ఆ సమయంలో ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండకపోవచ్చు. సరిగ్గా అప్పుడే రక్తదాతల అవసరం ఏర్పడుతుంది. రోగికి ఏ గ్రూప్ రక్తం కావాలో అందించి ప్రాణం కాపాడాల్సిన వస్తుంది. అయితే రక్తదానం పట్ల ప్రజల్లో ఉన్న అపోహల కారణంగా ఏ కొద్దిమందో ఇటువంటి సత్కార్యానికి సిద్ధపడుతున్నారు.

ఎందరికో ప్రాణదాత..



నా పేరు సూరాడ అప్పారావు. నేను ఇప్పటి వరకు 115 సార్లు రక్తదానం చేశాను. 2004 సంవత్సరానికి ముందే రక్తదానం చేసినా అదే సంవత్సరంలో కళావతి అనే మా అప్పరాలిని బతికించుకునేందుకు ఆ ఒక్క ఏడాదిలోనే అనేక సార్లు రక్తదానం చేశాను. అయినా ఆమె బతకలేదు. అప్పటి నుంచి రక్తం అవసరాన్ని గుర్తించాను. 2002లో స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థను ప్రారంభించాను. సంస్థ అధ్యక్షుడిగా ముందుండి రక్తదానం చేస్తుండడంతో ఎంతో మంది యువకులు ముందుకు వస్తున్నారు. రక్తం కొరత తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏడాదికి మూడు సార్లు రక్తదానం చేస్తున్నాను. నా సేవలు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య చేతుల మీదుగా ఘనంగా సత్కరించింది. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, మేయర్ చేతుల మీదుగా సత్కారాలు పొందాను. నా బాటలోనే నా కుమార్తెలు, కుమారులు ప్రతి ఏటా తప్పనిసరిగా రక్తదానం చేస్తున్నారు. చిన్న వయసులోనే రక్తదానం చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

సిటీ పరిధిలో బ్లడ్ బ్యాంక్‌లు..

రోటరీ బ్లడ్ బ్యాంక్ : జగదాంబ జంక్షన్ సమీపాన, డోరు నంబరు : 13–26–2/54, అపురూప ఆర్కేడ్, మక్కా మసీదు పక్కన, విశాఖపట్నం–2. ఫోన్ నంబర్లు 0891–2506678, 0891–6534635, పీఆర్వో వినోద్‌కుమార్ : 88855 23020.

లయన్స్ బ్లడ్ బ్యాంక్ : వాల్తేర్ మెయిన్ రోడ్డు, రాంనగర్, లయన్స్‌క్లబ్, విశాఖపట్నం. ఫోన్ నంబర్లు 0891–6692587, 0891–6692580.

ఏఎస్ రాజా వాలెంటరీ బ్లడ్ బ్యాంక్

వాల్తేర్ మెయిన్‌రోడ్డు, కేర్ ఆస్పత్రి పక్కన, విశాఖపట్నం. ఫోన్ నంబర్లు 0891–2543436, 0891–6663436.

ఎన్‌టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్..

వాల్తేర్ మెయిన్‌రోడ్డు, రాఘవేంద్రస్వామి గుడి పక్కన, లయన్స్‌క్లబ్ ఎదురుగా, విశాఖపట్నం. ఫోన్ నంబర్లు 0891–2555858, 0891–2565858, 9032005607.

ఎంత అవసరం..

దేశంలో ఏడాదికి ఐదు కోట్ల యూనిట్ల రక్తం అవసరం ఉండగా 80 లక్షల యూనిట్లు మాత్రమే లభిస్తోంది. ప్రతి రెండు సెకండ్లకు ఒక యూనిట్ రక్తం అవసరం ఉంది. 33 మిలియన్ల యూనిట్ల రక్తం ట్రాన్స్‌ఫ్యూజ్ అవుతోంది. ×ఒకె పాజిటివ్ రక్తం ఎక్కువగా అవసరమవుతోంది.

ఎవరైనా రక్తదానం చేయవచ్చా..

18–60 ఏళ్ల మధ్య వయసున్న ఆరోగ్యవంతుడైన ప్రతి వ్యక్తి రక్తదానం చేయొచ్చు. రక్తదాత ఆరోగ్యం గురించి పరీక్షలు జరిపిన తర్వాతే రక్తదానానికి అనుమతిస్తారు. రక్తనిధి వైద్యులు అన్ని పరీక్షలు జరిపాకే రక్తసేకరణ జరుగుతుంది. ఆరోగ్యవంతుడైన ప్రతి వ్యక్తి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయొచ్చు.

రక్తదానం చేయాలంటే..

రక్తదాత తన గురించి వివరాలు విపులంగా తెలపాలి. రక్తపోటు, శరీర ఉష్ణోగ్రత, హిమోగ్లోబిన్ శాతం చూస్తారు. రక్తదానం చేయడం వల్ల ఏ వ్యాధులు సంక్రమించవు. రక్తదానం తర్వాత 10 నిమిషాలు విశ్రాంతి తీసుకుని, అల్పాహారం సేవించి మామూలుగా వెళ్లిపోవచ్చు.

మంచి పని చేస్తున్నా అనుకుంటున్నా..



నేను వృత్తిరీత్యా ఆటో డ్రైవర్‌ను. విశాఖ ప్రభుత్వ విక్టోరియా (ఘోషాసుపత్రి) ఆటో స్టాండ్ వద్ద ఉంటాను. ఎంతో మంది గర్భిణులు రక్తం కొరతతో చనిపోయిన ఘటనలు నన్ను కలచివేశాయి. సమస్య ఎంత తీవ్రమైందో అర్థమైంది. దాదాపు 20 ఏళ్ల నుండి రక్తదానం చేస్తున్నాను. ఇప్పటి వరకు 34 సార్లు రక్తదానం చేశాను. నా రక్తం తీసుకున్న వారందరూ.. గొప్పవాడని కీర్తిస్తుంటే ఎంతో ఆనందిస్తున్నా. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వమనుకుంటున్నా.

– పోలవరపు అప్పలకొండ, ఆటోడ్రైవర్

జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్ సమావేశం



గ్రంథాలయ బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

దాబాగార్డెన్స్: జిల్లా గ్రంథాలయ సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్, సర్వసభ్య సమావేశం మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. పౌర గ్రంథాలయ శాఖ సంచాలకుడు ఆమోదించి పంపిన వివిధ పద్దుల కింద ఖర్చు చేసేందుకు నిర్వహించిన సమావేశంలో వివిధ పద్దుల కింద ఖర్చు చేయాల్సిన మొత్తాలను చర్చించి ఆమోదించారు. సమావేశంలో కొండా రాజీవ్‌గాంధీ, గ్రంథాలయ సంస్థ సభ్యురాలు జ్యోతి, వయోజన విద్య ఉప సంచాలకుడు ఎస్. సుబ్రహ్మణ్యవర్మ, జిల్లా పంచాయతీ అధికారి ఎం, వాసు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి రాచపోలమాంబ మహోత్సవాలు

అల్లిపురం: అల్లిపురంతో పాటు 14 గ్రామాల ఆరాధ్య దైవం రాచపోలమాంబ అమ్మవారి మహోత్సవాలు ఈ నెల 20 నుంచి వచ్చే నెల 17వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20వ తేదీన భూలోకమాత అమ్మవారి ఉత్సవం, 27వ తేదీన పరదేశమ్మ అమ్మవారి ఉత్సవం, జూలై 2వ తేదీన ఉజ్జిడి బండి తిరుగుతుందని, 3వ తేదీన పుట్ట బంగారం తేవడం, 4వ తేదీన దుర్గాలమ్మ అమ్మవారి ఉత్సవం, ఘటాల ఊరేగింపు, 8వ తేదీన సత్తెమ్మవారి పండగ, 9వ తేదీన మరిడమ్మ ఉత్సవం, 10వ తేదీన పూలఘటం, అమ్మవారి సతకం పట్టునుంచి తొలేళ్ల సంబరం, 11వ తేదీన ప్రధాన పండగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 18వ తేదీన మారువారం, 20వ తేదీన నీలమ్మ వారంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

జగన్నాథుని ఉత్సవాలకు మేయర్‌కు ఆహ్వానం



మేయర్‌కు ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈవో రాజగోపాలరెడ్డి తదితరులు

దాబాగార్డెన్స్: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో టౌన్‌కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి ఆలయ కార్యనిర్వహణాధికారి రాజగోపాల్‌రెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశారు. జీవీఎంసీ మేయర్ చాంబర్లో మంగళవారం మేయర్‌ను ఈవోతో పాటు ఆలయ ప్రధాన అర్చకుడు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా రథయాత్ర మహోత్సవాల ఏర్పాట్లు, క్యూలైన్లు, మెడికల్, మంచినీరు తదితర సదుపాయాల ఏర్పాట్లపై మేయర్‌కు ఈవో రాజగోపాల్‌రెడ్డి, అర్చకుడు జగన్నాథాచార్యులు వివరించారు. ఉత్సవాలు ఈ నెల 19 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు మేయర్‌కు వివరించారు.

ఘనంగా ముత్యాలమ్మ పండగ



ముత్యాలమ్మ అమ్మవారు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 28, 29 వార్డుల గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి 23వ వార్షిక పండగ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. నౌరోజీరోడ్డు, ఊటగెడ్డ, వంకలవీధిలో వెలసిన ముత్యాలమ్మ ఆలయం వద్ద ఘనంగా పెద్ద ఎత్తున పూజలు జరిపారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం 6 గంటలకు, తిరిగి 11 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు జరిపారు. 11.30 గంటలకు వెండి ఆభరణాలతో విశిష్ట దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలతో మొక్కులు సమర్పించుకున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి వంకలవీధి పరిసర గ్రామ పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ నెల 20న అమ్మవారి మారువారం సందర్భంగా ఆలయ ప్రాంగణం వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన జరపనున్నట్టు ముత్యాలమ్మ సేవా సంఘం తెలిపింది.

చిన్నారులకు చేరువగా అంగన్‌వాడీ విద్య



ర్యాలీలో పాల్గొన్న అదనపు సీడీపీవో శ్రీలత

మద్రిపాలెం: అంగన్‌వాడీ కేంద్రాలలో ఫోర్ డెవలప్‌మెంట్ కార్నర్ల ఏర్పాటు ద్వారా చిన్నారులకు విద్య చేరువ చేయాలని ఐసీడీఎస్ అదనపు సీడీపీవో శ్రీలత కోరారు. మద్రిపాలెంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ద్వారా జన భాగీదారీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ చుట్టుపక్కల నివసిస్తున్న తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కేంద్రాలకు ఆహ్వానించాలని కోరారు. ఆయా కేంద్రాలలో ప్రీ–స్కూలు విద్యాకార్యక్రమాలు పిల్లల సమగ్రాభివృద్ధికి ఎలా ఉపయోగపడు తున్నాయో వారికి వివరించాలని సూచించారు. మూడేళ్ల వరకు ఇంట్లో ఉండే చిన్నారులకు తరువాత మూడేళ్లు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఈ వయసులో పిల్లలు వినే అంశాల ఆధారంగానే బుద్ధి, తెలివితేటలు పెరుగుతాయని అన్నారు. ఆటలు, పాటలు, కథల ద్వారానే వారి మనసుకు హత్తుకునేలా ప్రీ–స్కూలు విద్య ఉంటుందని ఆమె గుర్తు చేశారు. ఐసీడీఎస్ సెక్టార్ల సూపర్ వైజర్లు వెన్నిసా సుందరి, వరలక్ష్మి, జేటీఎన్.జ్యోతి, వి.ఇందిరా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాతృ మరణాల నివారణ బాధ్యత వైద్యులదే



మాతృ మరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లాలో మాతృ మరణాలు సంభవించరాదని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల శ్రీకాంత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒక మాతృ మరణం సంభవించిందన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కారాదన్నారు. పీహెచ్‌సీ పరిధిలో మాతృ మరణాలు జరిగితే దానికి వైద్యులు బాధ్యత వహించాల్సి ఉందన్నారు. గర్భిణుల వివరాల నమోదు నాటి నుంచి ప్రసవించే వరకు సక్రమంగా సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, ఐసీడీఎస్ పీడీ డి.వెంకటలక్ష్మి, వీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషాప్రసాద్, గైనిక్ వైద్యులు డాక్టర్ సువర్ణ, డాక్టర్ శ్రీలక్ష్మి, మహిళా ఆరోగ్య అధికారి డాక్టర్ ఉమావతి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ ఎస్‌సీబీ నాయుడు, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



వెంకట శివ ప్రతాప్ (ఫైల్)

అల్లిపురం: భార్యతో తగాదాలు, కోర్టు గొడవల కారణంగా వ్యక్తి అదృశ్యమైన ఘటన టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం డాబాగార్డెన్స్, చాకలివీధికి చెందిన కిలాడి వెంకట శివ ప్రతాప్ ఈ నెల 3వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని, అతని కోసం నగరంలో పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదని అతని సోదరుడు కిలాడి వేణు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తప్పిపోయిన వ్యక్తి సుమారు 5.9 అడుగుల ఎత్తు కలిగి, నల్లటి శరీర ఛాయతో ఉంటాడని, తప్పిపోయినప్పుడు రెడ్ కలర్‌పై గీతల గల చొక్కా వేసుకుని ఉన్నాడని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 0891–2783672, 8919812412 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



దొండపర్తిలో ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

జగదాంబ: సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే విద్యార్థుల ఫీజుల నిమిత్తం సొంత నిధుల నుండి పలువురికి ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్మన్ కొల్లి సింహాచలం, జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ అలపన కనకరెడ్డి, సౌత్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బోని దేవా, వార్డు నాయకులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దొండపర్తిలో..

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 27వ వార్డు దొండపర్తి పరదేశమ్మ గుడి వద్ద ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పలువురు ఆయనకు వినతులు అందించారు. ఈ సమస్యలకు సంబంధించి ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా కుప్పిలివారి వీధికి చెందిన బిరదా రేవతి కుమారుడు గణేష్ స్కూల్ ఫీజు కోసం ఎమ్మెల్యే సొంత నిధుల నుండి రూ. 3 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 27 వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, కార్పొరేట్ డైరెక్టర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గాయత్రి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ శానాపతి వసంత

సింహాచలం : చినముషిడివాడ దరి శ్రమశక్తినగర్‌లో ఉన్న పంచముఖ గాయత్రి దేవి ఆలయ 13వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు విశేషంగా నిర్వహించారు. విష్ణుసహస్రనామ పారాయణ, లక్ష్మీ సహస్ర నామ పారాయణ చేశారు. అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అమ్మవారిని 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత దంపతులు, వైఎస్సార్‌సీపీ 97వ వార్డు అధ్యక్షుడు మెంటి మహేష్ దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త నరసింహమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా కనకమాంబ పండగ



అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రి అమర్‌నాథ్, కె.కె.రాజు, సారిపిల్లి గోవింద్



ఆకట్టుకున్న కాంతారా డ్యాన్స్ ట్రూప్

సీతంపేట: సీతంపేట గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి ప్రధాన పండగ కన్నుల పండువగా జరిగింది. మంగళవారం తెల్లవారు జామునుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సీతంపేట, గొల్లవీధి, నాయుడువీధి, కనకమ్మవీధి, శ్రీనివాసవీధి, గణేష్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులతో మొక్కుబడులు సమర్పించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. సాయంత్రం నాయుడు వీధిలోని పుట్టబంగారం ఘటాలతో అమ్మవారి అనుపోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అడుగడుగునా భక్తులు అమ్మవారికి హారతులతో నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోయ డ్యాన్సులు, నేల తప్పెటగుళ్లు, కోలాటం, పులి వేషాలు, పగటి వేషాలు, సేవ గరిడీలు, కర్రసాము, చెక్కభజన వంటి సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కాంతారా డ్యాన్స్ ట్రూప్ విశేషంగా ఆకట్టుకుంది. బాణసంచా, విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్,మాజీ ఎమ్మెల్యే విష్ణు కుమార్‌రాజు, సింహాచలం దేవస్థానం బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, ఆడిటర్ జీవీ, గొలగాని శ్రీనివాస్, చొక్కాకుల లక్ష్మీ వెంకటరావు అమ్మవారికి పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి సంతోష్, శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి సారిపిల్లి గంగరాజు, కోశాధికారి బోర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తల్లి చెంతకు కుమార్తె

గోపాలపట్నం: పాత గోశాల వద్ద తల్లితో నివాసముంటున్న ఓ బాలిక సోమవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. తల్లి రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపాలపట్నం పోలీసులు ఆమెను వెదికి పట్టుకుని, తల్లి చెంతకు చేర్చారు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామలక్ష్మి ఓ ఆఫీస్‌లో అటెండర్‌గా పని చేస్తోంది. ఈ నెల 12న ఆమె విధులకు వెళ్లిన సమయంలో బాలిక బయటికి వెళ్లింది. ఆమె ఎంతకీ తిరిగి రాకపోవడంతో తల్లి రామలక్ష్మి గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ ఈదుల నరసింహారావు వెంటనే స్పందించి సెల్‌ఫోన్ నెట్‌వర్క్ ద్వారా మాడుగులలో ఉన్నట్లు గుర్తించారు. ఇక్కడి నుంచి సిబ్బందిని పంపి మంగళవారం తీసుకొచ్చి తల్లికి అప్పగించారు.

కథోలిక పరీక్షలో అనూహ్యకు మొదటి బహుమతి



అనూహ్యకు బహుమతి అందిస్తున్న డాక్టర్ మల్లవరపు ప్రకాష్

అల్లిపురం: పునీత ఆంథోనీ చర్చి మహోత్సవంలో భాగంగా జనవరి 26వ తేదీన జరిగిన విశాఖ ఆర్సీఎం అగ్రపీఠం కథోలిక పరీక్షల్లో ఉత్తరాంధ్ర జిల్లాల స్థాయిలో విశాఖకు చెందిన నొడగల అనూహ్య ఇంగ్లిష్ మీడియంలో మొదటి బహుమతి దక్కించుకుంది. ఆమెకు విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాష్ బహుమతి అందజేసి అభినందించారు.

స్వర్ణ పతక విజేతకు సత్కారం

పెదగంట్యాడ: ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఏషియన్ చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించిన సత్తి దుర్గా స్ఫూర్తి శ్రీని రాఘవరెడ్డి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు మంగళవారం సత్కరించారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండర్ ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ స్ఫూర్తిశ్రీలో అసాధారణ ప్రతిభ ఉందన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కూడా సత్తా చాటిందన్నారు. ఈ పోటీలలో బంగారు పతకం సాధించడంతో పాటు బెస్ట్ బాక్సర్‌గా నిలిచిందన్నారు. క్రీడల్లో రాణిస్తున్న ఆ బాలికను, ఆమె తల్లిదండ్రులు సత్యనారాయణరెడ్డి, నాగలక్ష్మిలను సత్కరించారు. కార్యక్రమంలో జాగారపు శ్రీను, కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి, తమలంపూడి వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్ వద్ద ఆక్రమణల తొలగింపు

మద్రిపాలెం : నిత్యం ట్రాఫిక్‌జామ్‌కు కారణమవుతున్న రైతుబజార్ వద్ద ఆక్రమణలను తొలగించారు. ఐదో పట్టణ ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, ఎస్ఐ పాపారావు సమక్షంలో కానిస్టేబుళ్లు మంగళవారం ఆక్రమణలు తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న తోపుడుబండ్లు, హాకర్లను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తోపుడు బండ్లు హాకర్‌జోన్లలో మాత్రమే ఉంచి వ్యాపారాలు సాగించాలని కోరారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చిరువ్యాపారులు ట్రాఫిక్‌పోలీసులకు సహకరించాలని కోరారు.